క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి-కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో అలంకరించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో విందు భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని పలు ఆలయాలలో పూజలు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆదివారం ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. వెన్నపూస మల్లికార్జునరెడ్డి దంపతులు ఆలయ అర్చకులు రుద్రమూర్తి ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి రమణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక దొండపాడులోని శివాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణం తిలకించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శిల్పారామంలో ఆట-పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్రా డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు విజయశాంతి ఆధ్వర్యంలో చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



అరవిందనగర్ సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. సచివాలయాల వేదికగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు రోజుల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని పలు సచివాలయాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అరవిందనగర్‌లోని సచివాలయాల్లో ఆర్ఐ ప్రసాద్ పరిశీలించి రిజిస్ట్రేషన్ల తీరుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28, 29న బాలాలయం పూజలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో ఈ నెల 28, 29న బాలాలయం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసయ్య తెలిపారు. శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్వామివారి మూల విగ్రహ దర్శనం ఉండదని, అయితే ప్రతి రోజు స్వామికి చేసే పూజలు, అభిషేకాలు యథాప్రకారం ఉత్సవ మూర్తులకు జరుగుతాయని వివరించారు. భక్తులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఈఓ తెలిపారు.

శ్రీ కన్యకాంబ నమోస్తుతే!



విశేష అలంకారంలో శ్రీ వాసవీ కన్యకాంబ



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నకాష్‌లోని శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి 108 మంది దీక్షలో ఉన్న కన్యకలు క్షీర కలశాలతో అమ్మవారిశాల వరకు ఊరేగింపుగా వచ్చారు. ఆ కలశాలలోని క్షీరంతో అమ్మవారిని అభిషేకించి అలంకారం, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు కోలాటం ప్రదర్శించారు. అమ్మవారిశాల వద్ద సాయంత్రం అమ్మవారిని అగ్నిగుండ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మొక్కులు గల భక్తులు కూడా నిప్పులపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూలమూర్తికి సహస్ర నామార్చన, త్రిశతి దేవి ఖడ్గ మాల పఠించారు. నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కన్యకలు, సువాసినులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రాణం కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని చాటుతూ పాలకుల దౌర్జన్యాన్ని ఎదిరించి తమ వర్గాలకు ఆదర్శంగా నిలిచిన శ్రీ వాసవాంబ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు.

ఘనంగా గజ్జల పూజ మహోత్సవం



గజ్జల పూజలో కోలాటం చేస్తున్న గ్రామస్తులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివారులోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా గజ్జల పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోసుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కోలాటం గురువు సుధీర్ నేతృత్వంలో గ్రామంలోని ప్రజలు కోలాటం నేర్చుకొని చివరి రోజున గజ్జల పూజ కార్యక్రమాన్ని చేశారు. ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రాజగోపాల్‌రెడ్డి, శ్రీమంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ 49వ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.శ్రీధర్, అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ, మురళీకృష్ణశర్మ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు ఉంటాయని వారు పేర్కొన్నారు. 13వ తేదీ ఈ పూజలతోపాటు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు ముత్తయిదువులతో మాంగల్య పూజ నిర్వహింపజేస్తామన్నారు. మంగళవారం ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, సాయంత్రం 6 కు సహస్ర దీపాలంకార సేవ, సుమంగళి పూజ, దశ హారతులు నిర్వహిస్తారన్నారు. పాల్గొన్న ముత్తయిదువులందరికీ అమ్మవారి ప్రసాదంగా పసుపు, కుంకుమ, గాజులు, గంధం తదితరాలను అందజేస్తామని తెలిపారు. రాత్రి స్థానిక గాయకులచే భక్తి సంగీత విభావరి ఉంటుందని వివరించారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సత్కారం



కడప కల్చరల్ : అంకన్నను సత్కరిస్తున్న వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు



వైవీయూ : అంకన్నను సన్మానిస్తున్న రామప్రసాద్‌రెడ్డి, పరిశోధకులు

కడప కల్చరల్ : రాయలసీమ విశ్వవిద్యాలయం కుల సచివులుగా ఆచార్య నాగుల అంకన్న ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాత బస్టాండ్ సమీపంలోని జిల్లా కార్యాలయంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సహ ఆచార్యులుగా వైవీయూలో ప్రవేశించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎదిగిన డాక్టర్ అంకన్న విశ్వవిద్యాలయంలో వసతి గృహ సంక్షేమ అధికారిగా, కాంపిటీటివ్ సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ సభ్యులుగా, ఎగ్జామినేషన్ బ్రాంచ్ అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌గా, ఈక్వల్ ఆపర్చునిటీ సెల్, పర్చేసింగ్ కమిటీ సభ్యులుగా ఇంకా పలు పరిపాలనాపరమైన విధులను నిర్వర్తించి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జిల్లా కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో..

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ సహ ఆచార్యులు డాక్టర్ నాగుల అంకన్న కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమితులు కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైవీయూలోని ఆంగ్లశాఖ కార్యాలయంలో సన్మానించారు. రిజిస్ట్రార్‌గా చక్కటి సేవలందించి ఖ్యాతి గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు వెంకటయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్, తిరుమలరాజు, భైరవేశ్వర పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

కడప కల్చరల్ : గాన గంధర్వుడు ఘంటసాల వర్ధంతిని ఆదివారం కడపలో నిర్వహించారు. స్థానిక నెహ్రూ పార్కులోని ఘంటసాల విగ్రహానికి కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీరాగరంజని ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు ఏకే స్వామి, బాలరాజు, సుజాత, రూప, చారి ఆలపించిన ఘంటసాల సినీ పాటలు అభిమానులకు నాటి సినిమాలను గుర్తుకు తెచ్చాయి. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు ఈశ్వర్‌రెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరరావు, మచ్చా నరసింహ చార్య, అంజి, రఫీ, రామానుజం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : ఘంటసాలను ఎన్నటికీ మరువలేమని, ఆయన పాడిన పాటలు అజరామరమని కొండ పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండా సుబ్బయ్య అన్నారు. ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కడప నెహ్రూ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షుడు షేక్ రాయల్ కరీముల్లా, ఘంటశాల అభిమానులు శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో సోమ వారం నుండి శ్రీదుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి వారి నూతన బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట, ఉత్సవమూర్తుల సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ప్రదీప్‌కుమార్‌శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు గణపతిపూజ, రక్షాబంధనము, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశస్థాపన, లలితాసహస్ర నామ హోమం నిర్వహించి సాయంత్రం 5 గంటల నుండి అంకురార్పణ, జలాదివాసము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం ఉదయం నుండి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీహోమము, వేద ఆశీర్వచనం నిర్వహించి సాయంత్రం 5 గంటల నుండి మహాస్నపనము, ధాన్యాదివాసము, పుష్పాదివాసము, శయ్యాదివాసము నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం గర్తపూజ, యంత్రస్థాపన శాంతి పౌష్టిక హోమములు నిర్వహించి అనంతరం 10 గంటల నుండి దుర్గమల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించి సాయంత్రం నుండి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ డైరెక్టర్‌కు సన్మానం



వెంకట క్రిష్టారెడ్డిని సన్మానిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జోన్ పరిధిలో ఆర్‌జేడీగా వెంకట క్రిష్టారెడ్డి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. వెంకట క్రిష్టారెడ్డి మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను ఆదివారం కడపలో కలిసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ సురేష్‌బాబు సేవలకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమించడంపై సంబరాలు



మేయర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా కడప మేయర్ కె. సురేష్ బాబును నియమించడంపై పార్టీ నాయకులు, కార్పొరేటర్లు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో ఆయనకు గజమాల వేసి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పటి నుంచి జిల్లా అధ్యక్షుడిగా, రెండు సార్లు మేయర్‌గా సురేష్‌బాబు విశేష సేవలందించారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, నాయకులను సమన్వయం చేయడంలో కీలకపాత్ర వహిస్తూ వస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన సేవలను గుర్తించి రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి, ఆర్.చెన్నయ్య, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్ కుమార్, కె. రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వీరారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధాశక్తి వెలికితీయాలి



రాత పరీక్షను పరిశీలిస్తున్న అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయాలని కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ అంచెల విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో లేఖ విశేషాల గురించి విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు మునాఫ్, సుబ్బరాయుడు, సునీత దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక స్కాలర్స్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 21 టీంలు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో అందరిని అలరించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో జీవన జ్యోతి విద్యాసంస్థల విద్యార్థులు ప్రథమ స్థానంలో, కడప హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు నిత్యం క్రీడా సాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్లు బాలసుబ్బారెడ్డి, అమరనాథరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణాలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, చవ్వా శ్రీనివాసుల రెడ్డి, ఏఎం రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ల సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు తెలిపారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కడపకు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ కోఆర్డినేటర్ సుధాకర్‌బాబు రానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అసెంబ్లీ కోఆర్డినేటర్లు, మండల, పట్టణ అధ్యక్షులు హాజరు కావాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కారపురెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న మండల కన్వీనర్ చంద్రారెడ్డి

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని గంగనపల్లె, నాగాయపల్లె గ్రామ పంచాయతీల్లో రెండు టీమ్‌లుగా ఏర్పడి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికలల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగమల్లారెడ్డి, సుబ్బరత్నమ్మ, ఈశ్వరయ్య, సర్పంచ్‌లు నాగమల్లేశ్, సురేఖ మాజీ పాలతల చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద పుల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన విగ్రహ ప్రతిష్ట

గోపవరం : మండలంలోని చెన్నవరం గ్రామంలో శ్రీసీతారాముల స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 14వ తేదీ బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట, అదే రోజు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందవలసిందిగా నిర్వాహకులు కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



కలెక్టరేట్ సమీపంలో పోస్టర్లు అతికిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను కడప కలెక్టరేట్ ఎదుట డీఈఓ కార్యాలయం, కడప నగరంలోని పలు ప్రాంతాలలో గోడలకు అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, నాయకులు కరీముల్లా, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జొన్నల కొనుగోలు ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం నుంచి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి ముఖ్య అతిథులుగా హాజరువుతారని ఆయన పేర్కొన్నారు.